# వల్లభాచార్యుల తెలుగు పాటల వ్రాతప్రతిలో మరికొన్ని కొత్త పాటలు

- ఆచార్య వేటూరి ఆనందమూర్తి

**1.0** ముంబైలోని వల్లభాచార్య పీఠాధిపతి పరమ పూజ్య శ్రీశ్యామమనోహర పాటలున్న తొమ్మిది పుటల ప్రాచీన కాగితపు వ్రాతప్రతిని పరిశీలించి డిసెంబరు 2007 రసమయి పత్రికలో ప్రకటించిన నా వ్యాసాన్ని చూచి అనుకూలంగా స్పందించిన ఆ పీఠాధిపతులు మరో 44 పుటల వ్రాతప్రతిని డా॥ బలజపల్లి వేంకట శ్రీరామచంద్ర మూర్తి గారి మూలంగా పరిశీలనార్థం నాకు పంపించారు. అది పూర్వపు వ్రాత ప్రతి కన్నా మేలైన వ్రాతతీరు గలది. లిపి నాగరిలిపి. పాటలూ ఎక్కువగా తెలుగుపాటలే. అవీ వారు 16 తరాలుగా తమ పీఠంలో భద్రపరచుకొంటూ వస్తున్న వారసత్వపు నిధులు. ఇవి వల్లభాచార్యులవారు సమకూర్చుకొన్న వ్రాతప్రతి మాతృకలకు ఎన్నో తరం పుత్రికలో తెలియదు కానీ చాలా శిథిలమైన భాషరూపాలతో ఉన్నవి. భాషా తెలుగని స్పష్టమవుతున్నా అందులోని భావసౌష్ఠవం గానీ, భాషచ్ఛందోరూపాలు గానీ గుర్తింపనలవి కానంతగా రూపు చెడి ఉన్నవి. ఎంతో జాగరూకతతో పరిశీలించి పరిష్కరిస్తేనో, పూరిస్తేనో కానీ, వాటి స్వస్వరూపం తెలియరానట్లుగా ఉన్నవి. అట్టి కృషిని తెలుగు వారి బాధ్యతగా స్వీకరించి, స్వామి అనుగ్రహంతో వాటి నేనాటికైనా ఒకదారికి తెచ్చి తెలుగు వారికి సమర్పించగల్గుదుము గాకని కోరుతున్నాను. ఈ విషయమై వల్లభ పీఠం వారు వహించిన శ్రద్ధకు, ఆ నిధిని అందించడంలో చూపిన ఔదార్యానికి వారికి జోహారు లర్పిస్తున్నాను.

**2.0** సంశ్లిష్టంగా ఉన్న ఈ 44 పుటల వ్రాత ప్రతిలో ఇప్పటికి నేను చూచినంతలో చిన్న, పెద్ద పాటలన్నీ కలుపుకొని ఇంచు మించు 42 పాటలున్నట్లుగా గుర్తించాను. గుర్తించిన మేరకు ఆ పాటల పట్టికను కూడా ఈ వ్యాసంలోనే జతచేస్తున్నాను. వల్లభ పీఠం వారు భావించినట్లుగా ఇందులో అనేకం వల్లభాచార్యుల వారి తెలుగు పాటలే కావచ్చును. కాని సోపపత్తికంగా ఇతరులవిగా గుర్తింపదగిన పాటలు మఱికొన్ని కూడా ఈ వ్రాతప్రతిలో కాలాంతరాన చేరుతూ వచ్చినట్లున్నవి. ఉదాహరణకు - పుట 12-పాట 12- 'కంటి కంటి' అనేది తాళ్లపాకవారిది. రసమయి డిసెంబరు 2007లో ప్రకటితము; పు.42-పా.40 -'ఇట్టిముద్దులాడి' అనేదీ; పు. 37 -పా.38- 'మురహర నగధర' అనేదీ కూడా అన్నమాచార్యుల వారిదే. ఇవి మూడూ తిరుపతి ప్రతులలో ఉన్నవి. ఇక పు. 38 -పా. 35 'నల్లని మేనుకు'; పు. 42-పా.39 'ఇంతులాలా'; పు. 30 - పా 30 'శంకు చేతపట్టుకొన్న'; పు.20-పా. 18 'కనకాచల సమధీరం'; పు-21 - పా.15 'వందే శ్రీ రఘురామం' అనేవి కొన్ని తాళ్లపాక వారి రచనలుగా అనుమానింపదగినవి; వల్లభాచార్యుల వారివి కావడంలోనూ ఆశ్చర్యం లేదు. తాళ్ళపాక వారి పాటలకు ఒక సమగ్ర బృహదకారాది పట్టిక అందుబాటులో లేని కారణంగా ఇవి తిరుపతిలోని రేకులలోనో ఇతర వ్రాతప్రతులలోనో ఉన్నవో లేవో వెంటనే తఱచి పరిశీలించే అవకాశం నాకు కలగ





నందుకు చింతిస్తున్నాను. ఇక ఇందులోని పు. 37 - పా.31 'శ్రీకృష్ణం కలయసఖి' అనేది శ్రీమన్నారాయణ తీర్థుల వారి తరంగం. అట్లే పు. 24-పా.21 చాలా ముఖ్యమైన జలక్రీడల పాట "నాచారమ్మా కట్టిన పాటా నామా సంకీర్తనమూ" అనే రీతిగా ముద్రాంకితమై ఉన్నది. కనుక ఈ పాట వల్లభుల వారిది కాదు. దీనిని గూర్చిన సంగ్రహ సమీక్ష ఈ వ్యాసంలోనే చూడగలరు. ఈ వ్రాత ప్రతిలోని మరో పాట ఏల పాట. "గులే వారీ యేరా(లా)లు=గొల్ల వారియేలలు)" పు. 36-పా.34 అనేది మార్కాపుర మున వెలసిన వెన్నముద్దల చిన్ని కృష్ణుని గూర్చిన ఏల పదము. "నా ముద్దుల-చిన్నారీగుమ్మా॥ నా చక్కని-చిన్ని కృష్ణమ్మా!" అనే సంబుద్ధులతో ఏలా లక్షణముతో, శిథిల రూపాన ఉన్నది. పు. 32-పా.32 - "చందమామ తేవే (రావే) జాబిల్లి తేవే (రావే)" అనే పాతపాట మట్టులో గల చందమామపాట "కందువైన నవఖండ కండ చక్కెర తేవే" అనే ప్రాసబద్ధమైన పల్లవి పాదంతో రుచికరంగా ఉన్నది కానీ పాట మొత్తం శిథిల రూపంతో భ్రష్టమై మధ్య మధ్య మరో ఏల పాటతో కలసిపోయినట్లు కానవచ్చింది. తాళ్లపాకవారూ ఏలలు రాశారు. వల్లభులవారూ వ్రాసి యుండవచ్చు. వల్లభ పీఠం వారు దేశవ్యాప్తంగా ఉన్న తమ పీఠాలలో ఇలాగే ఎక్కడో మరో చోట జాగ్రత్త చేసి యుంచుకొన్న ప్రత్యంతరమో పాఠాంతరమో లభిస్తే తప్ప ఇలాటి పాటల పూర్ణ స్వరూపమెట్టిదో, కర్తలెవరో ఎరుగ రాదు. ఈ విషయంలో అన్ని వల్లభ పీఠాలవారి సహకారాన్నీ అపేక్షిస్తున్నాను.

**3.0** పుష్టి మార్గానికి మూలపురుషులైన శ్రీమద్వల్లభాచార్యులవారి పుత్ర పౌత్ర సంతతితో వర్ధిల్లిన ఈ వంశం వారి చరిత్రను, సంప్రదాయాన్నీ, ఏడు పీఠాలుగా విస్తరిల్లిన వారి వంశావళినీ, సమగ్రంగా గుర్తించి పరిశీలించడానికి ఆచార్యుల వారి మౌలిక రచనలు, వారి రచనలపై శ్రీమూలచంద్ర తెలివార్ (1887-1927) ది వ్రజ ఎఫిలియేట్ రిసెర్చ్ ప్రాజెక్ట్ అనే సంస్థ పక్షాన జరిపిన తొలి విశిష్ట కృషి, (విశేషాలకు చూ. గూగుల్ సైట్) ఇంకా వల్లభ పరంపరలోని ఈ ఏడు పీఠాలవారూ తమ వద్ద జాగ్రత్త చేసి ఉంచుకొన్న వ్రాత ప్రతులు ప్రధాన ఆకరాలు. వీటిల్లో క్రీ. 1559 ప్రాంతాలలో ఆచార్యుల వారి పౌత్రుడే అయిన యదునాథ్‌జీ రచించిన తాత గారి జీవిత చరిత్ర "శ్రీమద్వల్లభ దిగ్విజయ" మనే చంపూ కావ్యం చాలా ప్రధానమైనది. వీటితో పాటు దైవ కృపవలన మన కీనాటికీ శ్రీ మద్వల్లభాచార్యుల వారి తెలుగు పాటలుగా వెల్లడై గుర్తింప దగినవి కొన్నైనా లభించటం తెలుగు వారు చేసుకొన్న సుకృతమే.

**4.0** క్రీ.శ. 15, 16 శతాబ్దుల కాలంలో మహాకవులై, గురువులై, పదకవులై, పండితులై, మహామహులై, విఖ్యాతి కెక్కిన తాళ్లపాక పద కవిత్రయం వారి కించు మించు సమకాలికులై వర్తిల్లిన ఆచార్య పురుషులలో కాలక్రమాన అన్నమాచార్యులు (జననం 1424), వ్యాస యోగి వర్యులు (జ.1446), వల్లభాచార్యులు (జ.1479) ప్రముఖులు. వీరిలో తొలి వారైన అన్నమాచార్యుల వారి జీవిత చరిత్రను తెలుగులో ద్విపదచ్ఛందంలో రచించి అలాటి చారిత్రక జీవిత కావ్య రచనా ప్రక్రియకు శ్రీకారం చుట్టిన వాడు కథా పురుషుని పౌత్రుడే అయిన తాళ్లపాక చినతిరువేంగళనాథుడు (చిన్నన్న నామకుదు) కాగా, ఆ స్ఫూర్తి నంది పుచ్చుకొన్నట్లు వల్లభాచార్యుల వారి జీవిత చరిత్రను శ్రీమద్వల్లభ దిగ్విజయమనే పేరున సంస్కృత భాషలో కావ్య బద్ధం చేసిన వాడు ఆచార్యుల వారి పౌత్రుడైన యదునాథుడే. అలాగే వ్యాసరాయలుగాను, వ్యాస యోగిగాను ప్రసిద్ధులైన ఆచార్యవర్యుల జీవితాన్ని వ్యాసయోగి చరితమనే చంపూ కావ్యంగా సంస్కృతంలో రచించినవాడు సోమనాథ కవీశ్వరుడు. క్రీ.శ. 1537కి పూర్వమే అన్నమాచార్య చరిత్రను

రచించిన తిరువేంగళనాథుడు, **1559** ప్రాంతాల్లో వల్లభ దిగ్విజయాన్ని కూర్చిన యదునాథుడు, వ్యాసయోగి చరిత్ర (**1535**) కర్త సోమనాథుడు అనే "నాథకవిత్రయం" ఆచార్య పురుషత్రయమైన అన్నమాచార్య, వల్లభాచార్య, వ్యాసాచార్యుల జీవన సందేశాలను చిత్రించిన కవి చరిత్రకార త్రయంగా గుర్తించ వచ్చును.

**4.1** ఈ మూడు గ్రంథాలూ కూడా వాటి అవతరణం తర్వాత చరిత్ర గర్భంలో కొన్ని శతాబ్దుల పాటు ఆయా కుటుంబాల, పీఠాల వారి పరిరక్షణ లోనే దాగియుండి **20**వ శతాబ్దంలో వెల్లడి కావడం మరొక దైవ ఘటన. ఈ మూడు గ్రంథాలూ సమర్థుల చేతుల్లో సుపరిష్కృతాలై విలువైన పీఠికలతో వెల్లడి కావడం ఆ మధ్యయుగంలో తెలుగు నాట వెల్లివిరిసిన భక్తి భావ వైభవానికీ పదకవితా ప్రాభవానికీ ఎత్తిన వైజయంతీ పతాకలనవచ్చు. ఈ గ్రంథాలు మూడు అన్ని భాషలలోనికి అనువదింప బడి ఇతర చారిత్రక గ్రంథాలతో తులానాత్మకంగా పరిశోధింప బడాలని నా ఆకాంక్ష. సాళ్వ నరసింహ రాయని ఉదంతం తర్వాత దేవబయకారులైన తాళ్లపాక పదకవులను సత్కరించసాహసించని విజయనగర ప్రభువులు తమ అపచారాన్ని దిద్దుకొన్నట్లుగా తక్కిన యిద్దరు ఆచార్య పురుషులను అపూర్వంగా సమ్మానించినట్లు చరిత్ర చెబుతున్నది. వ్యాస యోగి వర్యులకు రాయసింహాసనాన్నిచ్చి రత్నాభిషేకం చేసి వ్యాసరాయ నామాన్ని సుప్రతిష్ఠితం చేసినట్లే, కాస్త ముందు వెనుకలుగా వల్లభాచార్యుల వారికీ తమ ప్రేరణతో, **27** రోజుల పాటు సాగిన పంచమతాచార్యుల చర్చా గోష్ఠితో, పాతికేళ్లు నిండని శ్రీమద్వల్లభాచార్యుల వారిని విజేతగా ప్రకటించి కనకాభిషేక గౌరవాన్ని కల్గించిన ఘనత కూడా నాటి విజయనగర ప్రభువులదే. రాయలవారి ఆముక్త మాల్యదలోని సంవాద విజయకథా ఘట్టాలకు, దాసరిగాన కైంకర్య కథా సన్నివేశాలకు ఇలాటి చారిత్రక సన్నివేశాలే స్ఫూర్తినిచ్చినవేమో! వ్యాసయోగి సమక్షంలో వల్లభాచార్యుల వారికి జరిగిన కనకాభిషేక సందర్భంలో కుమ్మరించిన మాడల్లో లాంఛనంగా ఒకటి పుచ్చుకొని ఆ సొమ్ముతో హంపిలోని విఠలాలయ ప్రాదుర్భావానికి దోహదం చేసిన వల్లభులవారు తక్కిన సొమ్మునక్కడి సామాజికుల శ్రేయస్సుకే వెచ్చించారని చారిత్రక సంప్రదాయ కథనమున్నది. "A snapshot of the time when Sri Vyasaraya was the chancellor of the university of vijayanagar is preserved in Goda's sampradaya kula Dipika in the third prakarana, where it is said that vyasa thirtha presided at an assembly when vallabhacharya visited vijayanagar in the time of Sri Krishna Devaraya" (See Para 84 of the Madras Epigraphical Report for 1922-23) Appendix Page 16 Sri vyasayogi charitam The life of Vyasaraja- Pub. 1926.

**5.0** ఇప్పుడిక వ్రాతప్రతిలోని కొన్ని పాటల పరిశీలనం. వ్రాతప్రతిలోని క్లిష్టతను, రూపు చెడిన పాట వైఖరిని సూచించడానికి అన్నమాచార్యుల సంకీర్తనంగా గుర్తించబడిన "ఇట్టి ముద్దులాడి బాలుడేడ వాడే" (క్రొత్త.**5-148**) అనే పాటను ఉదాహరిస్తున్నాను (చూ.వ్రాత ప్రతి నకలు). "గ్రాంమిడి తాననవచ్చీ కాంగె ఇట్టీ పాలలోనె చింమకూల కడియాల చేఈ విట్టి॥ చీమ గోటే నన్నే తన్నాచి కీటగన్నీల గార అహో చేలవీడకింతు ఉద్దీచునే॥ ఇంటి ముద్దు లాడీ బాలల గలడమలా ఈవీ ముద్దులాడీ బాలలగలడుమ లాందీడ పటే తిచే పోటే నిడా పాల పోయరే॥" తేకు పాఠం లేక పోతే అసలీ పాట నర్థయుక్తితో ఉద్ధరించి "సంస్కరించడం సాధ్యమయ్యే పనేనా?! మొత్తం పాటలోని వ్రాత తప్పులు, శిథిల భ్రష్ట రూపాలు అటుంచి "అపూడ ఈనా వింకటాద్రి = అప్పుడైనా వేంకటాద్రి" ముద్రతో పాటు "అపుడ ఈ నా గోవర్ధనాద్రీ హస్తమల్లా








'గ్రాంమిడి తానన వచ్చీ..' పాట వ్రాత ప్రతి నకలు

నోచేనమా వాలల్లోలో కూడ ఆడపోయ ఆడనే" అనే ముద్రాంతర పాఠాంతరాల చేరిక వ్రాత ప్రతిలోని క్లిష్టతను, శిథిల రచనా రూపాన్ని సూచిస్తున్నది. పరిష్కృతములైన తేకు పాఠాలెంత మెరుగైనవైనా 'అసవాలకుడుగాన', 'తప్పకుండ బెట్టె (బట్టీ?) వాని తలకెత్తరే' వంటి చోట్ల ఇంకా స్పష్టత లేదనిపిస్తున్నది. ఈ వ్రాతప్రతి పాఠం అస్పష్టంగా ఉన్నది. తేకులోని "అసపాలకుడు" గాన అనే పదం నిఘంటువుల కెక్కినట్లు లేదు. శక్తి సామర్థ్యాలు కలవాడు అనే అర్థాన్ని ప్రశ్నార్థకంతో నా పరిశోధనా వ్యాసంలో (**1976**) సూచించాను. ఇది వరకు పేర్కొన్నట్లు (రసమయి - డిసెంబరు, **2007** పు. **16**), తిరుపతి పాఠంలో లోపించిన ఒక పాదాన్ని పూర్తిగా అందించిన వల్లభాచార్యుల వారి వ్రాతప్రతి ఈ సన్నివేశంలో అంత సహాయకారి కాకున్నది. అయినా ఈ పాటకు పశ్చిమ భారతంలో ఎంత ప్రచారం లభించినదో ఈ వ్రాత ప్రతిలోని సంకీర్తన పాఠం వెల్లడిస్తున్నది. ఇట్లా దేశంలోని పలు ప్రాంతాల వారైన భక్తుల వాగ్వ్యవహారంలో చొచ్చుకుపోయినట్లే అందమైన ఈ పాటలోని భావ సంపద నాటి శిల్పుల్నీ ప్రభావితం చేసినట్లున్నది. "కాగేటి వెన్నలోన (పాలలోన) చేమ పూవు (పూల) కడియాల చేయివెట్టి" అనే సన్నివేశాన్ని చెక్కిన విజయనగర స్తంభ శిల్పాన్నొక చోట చూశాను. (అదియిప్పు డెక్కడున్నదో! నా గుర్తులోనూ లేదు). తిరిగి ఆ శిల్పం ఉనికిని వెదికి పట్టుకోవాలి!

**5.1** ముగ్ధ మోహన మైన ఈ పాటను గురించి చెప్పుకోవలసిన చమత్కార మొకటుంది. తిరుపతి రేకుల్లోని యీ పాట రాళ్లపల్లి వారి పరిశీలనలో పొరపాటున జారిపోయి, గౌరిపెద్దివారి సూక్ష్మ దర్శనంలో ఎలా బయటపడి గ్రంథస్థమైనదో తెలుసు కోవాలనే కుతూహలం గలవారు సంపుటం **12-148**, క్రొత్త **5**-పీఠిక చూడదగుదురు. వ్రాతప్రతిలో ఈ పాట, చరణంతో ఆరంభించి, పల్లవినందు కొనే పాట పరిపాటి చొప్పుననే వ్రాయబడి ఉండడం గమనార్హం.

**6.0** అన్నమాచార్యుల వారి పాట ఎత్తుగడలూ పలుకుబడులూ గలవీ, వల్లభాచార్యుల వారి రచనలూ కాదగినవీ ఈ వ్రాత ప్రతిలో మరి కొన్ని ఉన్నవి. ఇలాటి పాటలన్నీ సుపరిష్కృతములై విడిగా ఒక మోనోగ్రాఫ్ రూపాన ప్రకటించవలసినవే గానీ ఒక చిన్న వ్యాసంలో ఇమిడే అంశాలు కావు. అయినా కొన్నింటినిక్కడ పేర్కొంటాను. అక్కడక్కడ "వల్లభ", "శ్రీవల్లభ" నామం కానవచ్చినా అదే వీరి ముద్రాంకితమని చెప్పడానికి వీలులేకుండా ఉన్నది. శ్రీవల్లభ = శ్రీకృష్ణ పర్యాయంగానూ భావించ వచ్చును. ఈ వ్రాత ప్రతిలోని జోజో పాటల వంటిదే (రసమయి-డిసెంబరు **2007**) "బాలక్రీడలు" అనే పాట ఒకటి "స్త్రీల పౌరాణికపు పాటల సంకలనం"లో ఉన్నది. (చూ.పు. **58-61**). పాట చివరన "శ్రీ వల్లభ జోజో.. మంగళకర జోజో మా వల్లభ జోజో; స్థిరముగాను సిరులిచ్చి-ఎప్పుడు-కావవయ్య కృష్ణా!" అని ఉన్నది. ఇక్కడి శ్రీ వల్లభుడు, మా వల్లభుడు శ్రీ కృష్ణుడే. ఒక వేళ శ్రీవల్లభ పదమై ఉంటే స్వామి నామంతో పాటు స్వనామ ముద్ర కూడా ఉన్నదను

కోవచ్చునేమో!

**6.1** పు. 1-పా. 4 "వేదముల కంబములు వీలుగా నిలిపి" (చూ. రసమయి 12/07) ముద్రితము.

**6.2** 20-18 గోపకిశోరుని గూర్చిన సంస్కృత రచన. వేంకటముద్రలేనిది.

"కనకాచల సమధీరం । కామిత జన (మందారం)
ఘన కౌస్తుభ మణిహారం । గోష్టాంగణ సంచారం॥
కలయే గోపకుమారం । గోపీ మానస చోరం ॥
॥పల్లవి॥..."

**6.3** 2-15 శ్రీరాముని మీది సంస్కృత కీర్తనం. వేంకట ముద్ర లేనిది.

"వందే శ్రీరఘురామం- వందిత జగదభి రామం"
॥పల్లవి॥
దశరథ రాజకుమారం-మునిమానస సంచారం
వననిధి సమగంభీరం - దానవకుల సంహారం॥౧॥
అమర భవార్చిత వేదం-కమల భవార్చిత పాదం
సుమధుర మపగత ఖేదం - విమల నిరంతర మోదం
॥౨॥

తెలుగువారి సంస్కృత రచనల్లో యతి ప్రాసలుంటాయి. ఈ పాటలోని మొదటి చరణంలో యతి ప్రాసల నియతి పాటింప బడక పోయినా రెండో చరణంలో ప్రాసయతి కానవస్తున్నది. పల్లవిలోనూ ప్రాసయతి ఉన్నది. తొలి చరణంలో లేకపోవడం రచనా శైథిల్యానికి సూచకమేమో!

**6.4** చందమామపాట 32-31?

"చందమామ తేవే-జాబిల్లి తేవే
కందువైన నవఖండ కండ చక్కెర తేవే॥
మందలోన నాద కుంద - వందడోలలు తేవే॥
ముత్తి సరులు (?) తేవే-ముఙ్ఞుజున్ను తేవే
అత్తిన...? తియ్యని - అటుకులు తేవే॥..."

**6.5** విట్ఠలునిమీది పదము 35-30 వేంకట ముద్రలేనిది.

శంకు చేత పట్టుకున్న - స్వామి విటలా
(మంకుపట్టదేల నీకు-మాను) విట్ఠలా॥
గచ్చుమీరగా పిలచిన (గాచు)విట్ఠలా, కళ్లు
గచ్చకాయ లాయ నెదురు-గాంచి విట్ఠలా॥
మ్రొక్కెద మ్రొక్కెద నీకు-ముద్దు విట్ఠలా
చక్కని మాతంద్రీ - స్వామి విట్ఠలా॥
ద్వారకానాథుడవయ్య - దారు విట్ఠలా
శ్రీరుకుమిణీ పతివి నీవె - శ్రీవిట్ఠలా॥
శ్రీసత్యభామా పతివి- (సిరుల) విట్ఠలా
వాసవాది వినుత సార్వ-భౌమ విట్ఠలా॥

పండరంగి విఠలుని మీదను, వేంకట విఠలుని మీదను గల తాళ్లపాకవారి పదములు కూడా కొన్ని ఉన్నవి. వల్లభముద్రలేకున్నా విఠలకృష్ణుని మీది పదమిది వల్లభాచార్యులదే కాబోలును.

**6.6.** 39-36

"నల్లని వానికి - నాగరీకునకు
తెల్లని నామపు - దేవునికి
చల్లని చూపుల-జానకీ పతికి, శ్రీ
వల్లభులకు మా - దండమయా ॥౧॥
పంకజనేత్రికి దండమయా,
తిరు - వేంకటేశునకు దండమయా॥ ॥పల్లవి॥
కింకిణీ ధరునకు - గిరి ధరునకును
శంకర ప్రియునకు - దండమయా॥
లంక రావణుని-మదమడచిన తిరు
వేంకటేశునకు-దండమయా ॥౨॥
కనకాంబరమును-కౌస్తుభరత్నము
(వనమాలయుగల) వానికిని
పణతి నురమ్మున (బాయక నిలిపిన)
పద్మనాభునకు - దండమయా ॥౩॥

**6.7** పు. 41 - పా. 39

బాలకృష్ణుని మీది పాట - వేంకటముద్ర లేనిది.

"ఇంతులాల చెప్పరే వీ-డెవ్వడో గాని
(కంతున)ట్లున్నాడు - గయ్యాలవాడు ॥పల్లవి॥

పల్లవి, మూడు చరణాలతో నిండుగా ఉన్నది. వల్లభాచార్యుల వారిదే కాబోలును.

**6.8** పు. 36-పా. 34 తాళ్లపాకవారి ఏలపాటలు కొన్ని తిరుపతి రేకులలోనూ ఉన్నవి. ఇందులోని "గొల్లవారి యేలలు" కొన్ని, శిథిల రూపంలో దక్కినవి. వల్లభాచార్యుల వారి రచన కావచ్చు నేమో! "గులే వారీ ఏలాలు (= గొల్లవారి యేలలు) పాడెదము" అంటూ ముద్దులగుమ్మ, బాలకృష్ణమ్మ





అనే సంబుద్ధులతో గల ఈ యేలపాట పంక్తు లివి మచ్చుకి.

"చిలకుల (?) రావి రేకా, నొసటన చిన్న పోలి గోలూ, పాల శంఖోలూ మేమూ దినసనలోనే అంమ్మా నీకు నేను వెన్న ముద్దా చీకీ కూకున్నా నీకు నిన్నూ విన్నెపిట్టేనూ రారా వేడి కా గుంమ్మా॥

"ఇదీ వ్రాత ప్రతిలోని వ్రాత తీరు.

"కెలకుల రావిరేక, గళమున పులిగోరు, మొలలోన పాలశంఖులు - ఓ ముద్దుల గుమ్మా!
చాలినంత వెన్న పెట్టేనూ - వేడుక గుమ్మా!
నీకు నేనూ వెన్న పెట్టేనూ....
కల్ల లేని బాలకుండా - కొల్లలాడబోకుర నేను
నల్లనయ్యా వెన్న పెట్టేనూ॥ నాముద్దుల గుమ్మా!
మారకాపురమున - కోరి కోరి వెలసిన - మురలీధరుడ
కృష్ణమ్మా! వేడుక గుమ్మా! నా ముద్దుల గుమ్మా!

అనే తీరుగా సుందరమైన ఈ ఏలపాటను సవరించి పాడుకోవలసియున్నది. మార్కాపుర సంబంధమిందు గుర్తింప దగిన అంశము. నేటి ఒంగోలు ప్రాంతంలోని చెన్నకేశవ క్షేత్రము.

**7.0** ఈ వ్రాతప్రతిలో విశిష్టంగా చెప్పు కోవలసినది శ్రీ కృష్ణుని జలక్రీడలకు సంబంధించిన పాట. ఇంచుమించు పాతిక చరణాలు గలది; అతి శిథిల రూపాననున్నది. శ్రుతులతో జతులతో పాడుకుంటూ ఆడుకుంటూ గోపాంగనలు జలక్రీడలకు రావడము, కృష్ణుడు వారి వస్త్రాలను దోచి దాచడము, చీరలిమ్మని వేడగా చేతులెత్తి మ్రొక్క మనడము, తుదకు వారి ననుగ్రహించడము ఇందులోని ఇతివృత్తము. దీని మాతృక యెట్టిదో కానీ రెండేసి పాదాలు గల ద్విపదుల రూపాన యతి ప్రాసలతో కూడుకొన్న సుందరమైన రచనగా ఉండునని తోచును. ఇట్టిదే మరొక రచన "చెన్నరంగ వాసా! పన్నగట-శయన రంగధామా!, కన్నెలు క్రీడలాడ కృష్ణుడు-చిన్నెలు గావించీ" అనే ఆరంభంతో ఆడువారి వాగ్వ్యవహారంలో నలిగినపాట కృష్ణశ్రీ సంకలనం చేసిన స్త్రీల పౌరాణికపు పాటలలో ఉన్నది (పు. 88-92). అది యీ పాట కన్నా పెద్దది.

రచనల్లో సంవాద మున్నది. తులనాత్మకంగా పరిశీలించవలసినది. వల్లభాచార్యుల వారి వ్రాత ప్రతిలో అతిశిథిలమై కానవస్తున్న పాట యిది, వారు సేకరించి గ్రంథస్థం చేసుకొన్న పాతపాటే కానీ, యీ రచన వారిది కాదనీ, వారెరిగిన సన్నిహితుల దెవరిదో కాదగుననీ తోస్తున్నది. పాట చివరన "నాచారమ్మా కట్టిన పాటా నామా సంకీర్తనము" అని గేయకర్త్రి పేరుండడం ఈ ఊహకు కారణం. ఈ పాట కట్టిన "నాచారమ్మ" ఎవరన్న జిజ్ఞాసతో పరిశీలించగా వల్లభులవారి వంశావళిలో ఇట్టి పేరున్న స్త్రీ లెవరూ కానరాలేదు. తాళ్లపాక వారి నెరిగిన వారే వల్లభుల వారు. వారి పాటలు కూడా వీరి వ్రాతప్రతులలో చేరి యున్నవని మనమిది వరకే గుర్తించాము. ఈ దృష్టితో పరిశీలించగా తాళ్లపాక వారి వంశంలో నాచారమ్మ పేరుగల వనిత ఒక్కరే కానవచ్చారు. ఆమె ఎవరో కాదు అన్నమాచార్యుల వారి పెద్ద కోడలు. "పాడజెప్పగవర్ణ పద్ధతి నీడు జోడు లేదని సభ జొచ్చి వాదించి పరగినధీశాలి" నరసమా చార్యుని భార్య. నారాయణయ్యకు తల్లి. ప్రథమాంధ్ర కవయిత్రి అయిన తాళ్లపాక తిమ్మక్కకు కోడలు. ఈ నాచారమ్మ కూడా కవయిత్రి కాబోలును. ఈ పాట ఆమె రచన యగునా అని తోచెను. ఈ యూహ కుపబలకముగా తాళ్లపాక వాగ్గేయకారుల శిలా శిల్పాలుగా గుర్తింపదగిన వాటిలో కొన్ని స్త్రీ మూర్తుల శిల్పాలు గానదండెతో సూచీహస్తంతో ఉన్నవి కలవు. అట్టివేవైనా తాళ్లపాక తిమ్మక్కవో, నాచారమ్మవో కావచ్చునన్న ఊహకు బలాన్నిస్తున్నవి. ఇంతకూ ఈపాటలో "నాచారమ్మ కట్టిన పాట" అని ఉండడమూ, అది వల్లభాచార్యుల వారి వ్రాతప్రతి కెక్కియుండడము, అట్టి వాగ్గేయకారిణుల శిల్పాలుం డడము ఇందుకు బలమైన కారణాలు. కనుక ఇది తాళ్లపాక నృసింహకవి భార్యయైన నాచారమ్మ కట్టిన పాటయనీ, ఆమె ఆ కుటుంబంలోని రెండవ కవయిత్రియనీ, తాళ్లపాక తిమ్మక్క తొలి తెలుగు

కవయిత్రికాగా నాచారమ్మ ద్వితీయాంధ్ర కవయిత్రిగా గుర్తింప దగిన రచయిత్రియనీ నేటికి లభ్యమైన ఆధారాలను బట్టి పేర్కొనవచ్చు.

తాళ్లపాక తిమ్మక్క రచించిన సుభద్రాపరిణయ మనే పెండ్లి పాట ఆడువారి గాన వ్యవహారంలో ప్రచారం పొంది రూపాంతరాలతో స్త్రీల పాటలకెక్కినట్లే ఈ నాచారమ్మ కట్టిన పాట కూడా లోకవ్యవహారంలో నానా రూపావతారాన్ని పొందినట్లున్నది.

**7.1** తాళ్లపాక వారికిని, చుండుపల్లి వారికిని, వల్లభాచార్యుల వంశం వారికిని, తరిగొండ వేంగమాంబ వంశం వారికిని వివాహ సంబంధ బాంధవ్యాలున్నట్లు మన మిది వరకు (రసమయి03/08) గుర్తించిన అంశమే. కనుక వారి వారి వంశావళులను, ఇచ్చి పుచ్చుకొన్న ఆడపడుచుల పుట్టి నింటి వారి పేర్లను, పరిశీలించి చూస్తే మరికొంత సమాచారము లభ్యము కాగలదు. ఆ దిశగా సాగే పరిశీలనకు దైవమనుకూలించును గాకనీ, ఆయా కవి కుటుంబాల వారి యిండ్ల నుండీ, పీఠాల నుండీ తగిన సహకార ముందును గాకనీ కోరుకొందాము. ఇలాటి వంశావళులలో సాధారణంగా ఆడువారిని గూర్చిన వివరణ అధికంగా లేకపోవడము, ఉన్న వంశావళుల లోనూ కారణాంతరాలచేత సమగ్రత లేకపోవడము అనే లోట్లు ఇట్టి పరిశీలనలో ఎదురయ్యే ప్రతిబంధకాలనక తప్పదు. కనుక ఇట్టి సమస్యలను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించు కోవలసియున్నది.

**7.2** వ్రాతప్రతిలోని ఈ పాట పాదా లనేకం కలగాపులగంగా కలిసిపోయినట్లున్నవి. మాదిరికి ఇక్కడ నాచారమ్మ కట్టిన నామ సంకీర్తనపు పాటలోని కొన్ని ద్విపదుల్ని రచనలోని గతివైవిధ్యానికీ, ఇతి వృత్తానికీ సూచికలైన వాటిని పేర్కొంటాను. యతి ప్రాసలలోనూ చరణాల, అంకెల గుర్తింపులోనూ కొన్ని తడబాట్లున్నవి. గుర్తించి సవరించిన మేరకు వరుస క్రమంలో ఉదహరిస్తున్నాను.

"శ్రుతులను మీరకపాడెద మర్దళ -
    గతులకు ధిమిధిమి దిద్ధిమి యనగా
జతులను మానక లీలగ నందలి -
    గతులకు ధళాంకు ధళ ధళ్లనగా॥
వేణునాథ ప్రియ పరమాణు రూపా -
    వినుమహో గోపీనాథా!
వీణను మీటుచు పాడెద మోహన -
    కిణికిణికింకిణి కిణికిణి యనగా॥
ఎదర కంచుక మెదయ - నెవరు రారెదుటకి
కడిది మకురు మాను - కంతుడా
మిడిమేలమ్మున - మిడికి మాయెద నీవు
వెడవినోదము లేమి - యాదేవు॥

* * *

జలక్రీడ చాలించి - బిల బిల మని స్త్రీలు
కొలనిగట్టున వలు - వలు గట్టగా వచ్చి
చెలు వైనయట్టి తమ - చీరెల గానక
వెలవెల ముఖములు - వ్రేలి చిన్నయి పాయ॥

* * *

మదుగులేరి తాను - వరదుడై తెచ్చిచ్చె
తడయక శ్రీహరి - తక్షణ మియ్య కొనరె
మదుగులు కావుగదా వెలసిన - మైలవెమా కియ్యరా
మదుగులు మాకేలరా అచ్యుత - మా చీరలే ఇయ్యరా॥

* * *

వనమునందున్నారము మాకు నా - వలికి రాను సిగ్గురా
కొనిన చీరల నియ్యరా కట్టేము-గోవింద మదుగు లేము
(అ) మచ్చె కూర్మ వరాహవతారుడా -
    అచ్యుతుడ చీరలందీర
వామనుండ యియ్యరా చీరెలు - వాసుదేవ యియ్యరా॥
(చీరెలు సిగ్గులె) స్త్రీల కలంకారము -
    శృంగారమయుడ నీవియ్యరా
వారిజ నాభుడా వాసుదేవాహరి -
    వనమాలా ప్రియ (యియ్యరా)॥

* * *

సన్న దాటుల చీరె ఓ యక్కా -చాళ్లు పోసిన చీరె ఓయక్కా
విన్నదనముల చీరె విను మోయక్కా గో -
    విందకూనచీరె ఓయక్కా॥
కరకంచుల చీరె ఓయకా -
    కస్తూరి మల్లి చీరె ఓయకా
ఒరయు దంతుల చీరె ఓయకా -
    ఉదయ రాగము చీరె ఓయకా॥





అందమద్దిన యట్టి దోయక్కా -
    అవపూవన్నె చీరె ఓయక్కా
అందముగ ముత్యాలు వెండితో -
    హంస చిలకల చీరె ఓయక్కా॥
చింతాకు వన్నె చీరె ఓ యక్కా మొగలి -
    చిగురు వన్నె చీరె ఓ యక్కా
చెంద్రకావి చీరె ఓ యక్కా -
    పొగడ (సిరి) వన్నె చీరె ఓ యక్కా॥
పగటు పట్టు చీరె ఓ యక్కా నీలి -
    (వన్నె) కాంతుల చీరె ఓ యక్కా
నిగ నిగ మెరిసేటి దోయక్కా -
    నీలి మేఘపు చాయ దోయక్కా॥

* * *

ఒందు చేతను మ్రొక్కితే చీరెలు - ఓ యక్క యిచ్చెదను
రందు చేతుల మ్రొక్కితే వలువలు - రక్షణ మయ్యేను॥

* * *

కంకణ స్వరములు - గౌళ స్వరములు మ్రోయగాను
కొంకక చేతులు విడిచి పెట్టి - గోవింద హరి యనరె॥
సురలు పూలవాన కురియగాను -
    సురదుందుభులే మ్రోయ సాగెను
హరి అచ్యుతుండపుడువచ్చి -
    వర(ము లిచ్చే నిచ్చు) మెచ్చి॥
మాట లెరుగకున్న మాతో (నాట)లాడె (మధుని)కుంజ ప్రియుదు హరియే
(పేటంచు చీరెల పేర్మిని) మా స్వామి -
    పెట్టె మాకుంగోట్లు (సరియే)॥
నాచారమ్మా కట్టిన పాటా - నామా సంకీర్తనము
(నాచవులూర చదివిన వినినా - పాడిన పుణ్యమ్ము॥)



(నాచారమ్మ కట్టిన పాట వ్రాతప్రతినకలులో మచ్చుకు కొంత భాగం)

**7.3** అన్నమాచార్యుల వారి సంతతి వారు అరిండ్ల వారై విస్తరిల్లినట్లే వల్లభాచార్యుల వారి సంతతి కూడా ఏడు పీఠాలుగా ఏర్పడినవని చరిత్ర, సంప్రదాయము చెబుతున్నవి. లభ్యమైనంత వరకు వారి వారి వివరాలివి.

నాటి తాళ్లపాక వారి అరిండ్లు ఇవీ -

1) ఊటుకూరివారు - తాళ్లపాక శేషాచార్యులు - సంకీర్తన సేవకై నేడు తిరుపతిలో నెలకొన్నవారు.

2) మడితాడు వారు - తాళ్లపాక సూర్యనారాయణయ్య - అన్నమాచార్య చరిత్ర ద్విపద కావ్యాన్నీ, అన్నమాచార్యులు తమ యింట పూజించిన పంచలోహ విగ్రహాదులను తిరుపతికి చేర్చిన వారు వీరే. పెద తిరుమలాచార్య దంపతుల బంగారు విగ్రహము నందించిన వారును వీరే (చూ. రసమయి 02/08).

3) పెద్దినేని కాల్వ గ్రామం మజరా బూడిదేటి పల్లెవారు - మహాదేవయ్య - వీరు ముదుం పాడుకి తరలివెళ్లిరి.

4) మాచనూరి వారు - తాళ్లపాక సుబ్బారాయుడు.

5) కమలాపురం తాలుకా రాజు పాలెం వారు - తాళ్లపాక లక్ష్మీ నరసయ్య.

6) వాయల్పాడు తాలూకా ఎర్రవారి పాళెం - తాళ్లపాక వేంకట్రామయ్య.

(ఆకరము - తాళ్లపాక సూర్య నారాయణయ్య గారు **1949** ఏప్రెలులో జరిగిన అన్నమాచార్య వర్ధంతి ఉత్సవ సభలో సమర్పించిన ప్రసంగ పత్రము. తి.తి.దే. వారు ప్రకటించిన నాటి నివేదిక చూచునది.)

**7.4** వల్లభాచార్యుల వారి సంతతి వారు నెలకొల్పిన ఏడు పీఠాల వివరాలివి -

1. గిరిధర్‌జీ - విఠలనాథ్‌జీ పెద్ద కుమారుడు
2. గోవిందరాయజీ - విఠలనాథ్ జీ రెండవ కుమారుడు
3. బాలకృష్ణజీ - విఠలనాథ్‌జీ మూడవ కుమారుడు
4. గోకులనాథజీ - విఠలనాథ్‌జీ నాల్గవ కుమారుడు
5. రఘునాథ్‌జీ - విఠలనాథజీ ఐదవ కుమారుడు
6. యదునాథజీ - విఠలనాథజీ ఆరవ కుమారుడు
7. ఘనశ్యామజీ - విఠలనాథజీ ఏడవ కుమారుడు

(వీరిలో ఆరవ పీఠానికి చెందిన యదునాథజీయే శ్రీమద్వల్లభ దిగ్విజయకర్త). మొదటి పీఠాధిపతియైన



వల్లభాచార్య పరంపరలోని కొందరు పీఠాధిపతులు
(నారాయణదాజీ (ప్రకటించిన) వల్లభాచార్య మహారాజాస్ - గురూస్ ఆఫ్ వల్లభాచార్య సెక్ట్ - బాంబే 1863 (చూ. ఎస్‌సిబి వారు ప్రచురించిన గ్రంధము)

గిరిధర్‌జీ సంతతిలో 16వ తరానికి చెందిన నేటి పీఠాధిపతి పూజ్యశ్రీ ఘనశ్యామజీ మహారాజ్ వారే వల్లభాచార్యుల వారి వ్రాతప్రతులను, వంశావళిని మనకందించిన వారు)

**8.0** మనకిప్పటి వరకు ఆ మహనీయులైన మూలపురుషులకు సంబంధించి లభించిన సాధనసామగ్రి ఆయా శాఖల వారు సమకూర్చి లోకాని కర్పించినవే. తాళ్లపాక అన్నమాచార్యుల మనుమల తరం నుండీ వారు ఆరిండ్ల వారై విస్తరిల్లినట్లే వల్లభాచార్యుల వారి మనుమల తరం నుండీ వారూ ఏడిండ్ల వారై దేశంలో విఖ్యాతి కెక్కినారు. వీరిలో అన్నమాచార్యుల మనుమడు తాళ్లపాక చిన తిరువెంగళనాథుడు అన్నమాచార్య చరిత్ర వ్రాయకపోయినా, దానిని చిన్నన్న వంశం వారైన సూర్యనారాయణయ్య జాగ్రత్త చేసి తిరుపతికి చేర్చకపోయినా, దానిని ప్రభాకరశాస్త్రి గారు పరిష్కరించి దేవస్థానం వారి చేత ప్రకటింప జేయక పోయినా మనకీనాడు అన్నమాచార్యుల ప్రఖ్యాతి ఇంతగా తెలియకనే పోయేది. అలాగే వల్లభాచార్యుల వారి మనుమడైన యదునాధుడు వల్లభ దిగ్విజయం వ్రాయకుండినా, వారి పీఠంవారు ఆ గ్రంథాన్ని జాగ్రత్త చేసి వెల్లడించక పోయి వుండినా వల్లభాచార్యుల వారి జీవనరేఖ మనకీ మాత్రమైనా తెలిసి ఉండేది కాదు. అట్లే సోమనాథ కవి వ్యాసతీర్థుల చరిత్రను గ్రంథస్థం చేయకపోయినా మైసూరు వారో, మాధ్వ గురుపీఠం వారో, దానిని సంపాదించి ప్రకటింపక పోయి వుండినా వ్యాసయోగి కథ అందదుకులు గానే ఉండేదని చరిత్ర పరిశోధకులనడంలో సత్యం లేకపోలేదు. కనుక మరిన్ని విశేషాలు అట్టి వ్యక్తులనుండీ, సంస్థల నుండీ క్రమక్రమంగా నైనా తెలియ రాగలవని ఆశిద్దాము.

**9.0** వ్రాతప్రతిలోని పాటల పట్టికయిది. జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించి ప్రకటింప వలసిన ఇలాటి కీర్తనలన్నీ వెలుగులోకి రావడానికి మరికొంత కాలం పట్టగలదు కనుక ఈ లోగా చవులూరించే వాచవి యిది.







| పుట | పాట సంఖ్య | పాటమొదలు | సూచన |
|---|---|---|---|
| 1 | 3 | లాలిజోజోజోజో॥ | ఇది పాట ముగింపు; పూర్వ భాగము లుప్తము |
| | 4 | వేదములకంబములు | |
| | 5 | పట్టుపుట్టమ్ములు | |
| 2 | ? | హే దయాలంకార | |
| | 15 | గోపాలపతి | |
| 3 | ? | శృంగారముల కెల్ల శృంగారమైనట్టి | |
| | ? | జోజో కులరత్నమా | |
| 4 | 16 | నవరత్న ఖచిత | |
| 5 | 8 | డొంగిలిన యీ వేళ | |
| 6 | 18 | నదవడి చూచుటే(?) | పెద్దపాట |
| 8 | 9 | జేవజేత శేషశాయి | |
| | ? | శ్రీరామభద్ర సాయమ్మ లాలి | పెద్దపాట |
| | ? | ప్రసన్న వేంకట ముద్రతోగల పాట | |
| 10 | 10 | ధాతాకు తాతయైన తండ్రిలాలి | |
| | 11 | గోపిదేవీ నీసుతుడు కొల్లకాడమ్మా | |
| 11 | ? | ఏమని చెప్పేదమ్మా | |
| | ? | ఇంద రారా గోవింద రారా | |
| 12 | 12 | కనకంపు చరణాలు - తాళ్లపాక వారి పాట | (రసమయి 12/07) |
| 13 | 13 | నిగనిగ మనోహర - | పెద్దపాట |
| 15 | ? | శతకృత (?) | |
| 15 | 14 | చెంజి వెంకట నాథరమణ | చెంజి వెంకట రమణ ముద్ర? |
| | ? | అతిముదమున నేనూచెద | పెద్ద పాట |
| 16 | ? | బాల గోపాలకృష్ణ జోజో | |
| 17 | 15 | ఉయ్యాలా జంపాలా ఊగునా తండ్రీ | (ముద్రితము రసమయి 12/07) |
| 18 | 16 | వేడిపాల దొంగ వెన్న ముద్దల దొంగ | |
| 19 | 17 | అజ్జకు అజ్జకు | |
| 20 | 14 | కనకంపు రత్నాలు ఘల్లు ఘల్లున | |
| | 18 | కనకాచల సమధీరం - | సంస్కృతం |
| 21 | 15 | వందే శ్రీరఘురామం - | సంస్కృతం |
| 22 | 20 | బ్రహ్మాణా (?) - | సంస్కృతం |
| 23 | ? | ప్రేమ చూడామణీ | |
| 24 | 21 | ప్రతులను మీరక - | నాచారమ్మ కట్టిన పెద్దపాట |
| 29 | 25 | మేలైన రత్న | |
| 30 | 31 | గజ్జెలు ఘల్లన కలికి నవ్వుల తోను-గోకుల తెలుంగు రాయ రావయ్య | తెలుంగు రాయడు? |
| 31 | 26 | చిన్నారి పొన్నారి చిన్ని - గోపాల... పరగంగ గౌళ పాడేర జోల | గౌళలోజోల! గౌళరాగ ప్రస్తావన ఇందధికముగా కలదు. |
| 32 | 32 | వారిజ లోచన? | |
| | ? | చందమామ తేవే జాబిల్లి తేవే | చందమామ పాట |
| 33 | 38 | పిన్న బాలుండయి వచ్చీని | |
| 34 | 33 | పాలలో చెయి ముంచీ | |
| | ? | నల్లని మేఘచ్ఛాయవాడే | |
| 35 | 30 | శంఖుచేత పట్టుకున్న - స్వామి విఠలా | విఠలపదం |
| 36 | 34 | నాముద్దుల చిన్నారీ గుమ్మా ... గొల్ల వారీ యేలలు - పాడెదమనరే | ఏలపదం |
| 37 | 31 | శ్రీ కృష్ణం కలయసఖీ | (శ్రీమన్నారాయణ తీర్థుల తరంగం) |
| | ? | మురహర నగధర (చూ.పు. 39) | |
| 38 | 34? | సుందరులందరు | |
| 39 | 35 | నారాయణతే నమోనమో | తాళ్లపాక వారి పదం |
| | 36? | నల్లని వానికి నాగరీకునకు | వేంకట ముద్ర కలదు |
| 40 | 36? | కంకణ రవములు ఘల్లని మ్రోయగ | |
| 41 | 38 | మొలనూలు ఘంటలు మ్రోయకుండ | |
| 42 | 39 | ఇంతులాలా చెప్పరే వీడెవ్వడో కాని | |
| 43 | 40 | గామిడి తనానవచ్చి- (తాళ్లపాక వారి పాట) | |
| 44 | 39? | పిన్నవాడు మాయింటికి వచ్చినాడు | |
| | 41 | ఎప్పుడూ వేడనయ్యా ॥పల్లవి॥ | పల్లవి మాత్రమే కలదు |

(ఇంతవరకే ఈ పాటలు దొరికినవి అని అందించిన వారి సూచన)

వల్లభ పీఠం వారు పంపిన వంశావళిని స్థలాభావం వల్ల ఇక్కడ ప్రచురించలేకపోతున్నాము. 15"X9" సైజులో వున్న ఆ చార్టును 'రసమయి' పేజీ సైజు (7½" X 5")కు కుదించి ముద్రిస్తే నాగరలిపిలో అసలే చిన్నదిగా వున్న అక్షరాలు కనిపించే అవకాశం లేదు. - సం॥